

# ఒడ్డాణం

"పేరున్న పాఠశాలల పిల్లాడికి సీటు సంపాదించడం మనతో అయేపని కాదునాన్నా !"

కొడుకు... చిన్నారి ప్రహ్లాద్‌ను "ప్రతిభ" పాఠశాలలో చేర్చాలని తీసుకెళ్ళి మొహం వేల్లాడేసుకు వచ్చిన తిరుమలరావులో నిరాశ తిష్ట వేసుక్కూచుంది.

"నానిగాన్ని వెంటేసుకుని నాలుగుసార్లు చక్కర్లు కొట్టిన. అడిగినంత డొనేష నిస్తానన్నాను ... " కసి ముంచుకొచ్చింది. "కాని ... ఆ ఒడ్డాణం ఒప్పుకుంటేనా ! లక్ష యక్ష ప్రశ్నలడిగి లక్షణంగా వాపస్ పంపించింది." టక్ సవరించుకుని తలపట్టుక్కూచున్నాడు.

"అరెరే ... తెలుగు పండితుని కొడుక్కు తెలుగు మీడియం పాఠశాలల సీటు కరువైందా ? .... "

ఇంగ్లీషు లెక్చరర్‌గా పంజేసి ఇరవై రోజుల క్రితం రిటైరై సొంతింటి కొచ్చిన వెంకట్రామయ్యకు ఇరకాటంలో పడిపోయినట్టనిపించింది.

పాతికేళ్ల కొడుకును పాదాలనుండి పెదాల దాకా పరిశీలించి చూసిండు. "నువ్వన్నది నిజమేనా ?" అని ప్రశ్నిస్తున్నాయా చూపులు.

"అవున్నాన్నా ! మన సంస్కృతీ, సాంప్రదాయాల గురించి ఎన్ని ప్రశ్నలడిగిందనీ ! వర్తి తిరోగమనవాది లాగుంది. ప్రపంచమంతా కొత్త అలంకారాలతో ముందుకు పోతుంటే ఆమె కొన్ని దశాబ్దాల వెనక్కు పోతోంది. ఆ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సతమతమై పోయాననుకో. నాలుగేళ్ల పోరన్ని స్కూల్లో చేర్చుకుని నాలుగక్షరం ముక్కలు నేర్పుమంటే నన్ను పరీక్షించాకనే వాని సీటు సంగతి చెప్తానని తెగేసి చెప్పిందా ఒడ్డాణం ... " లోపలి కుతకుతలు మొహమ్మీద ముచ్చెమటలు పోయిస్తున్నై.

"ఒడ్డాణమా ... ఒడ్డాణమేందిరా ?" నుదుటి మీది అనుభవరేఖలు ఆశ్చర్యార్థకాలై పోయినై.

"అదే నాన్నా ... ఒడ్డాణం అలంకరించుకున్న హెడ్మాస్టరమ్మ. ఆ ప్రతిభ పాఠశాలల పాఠాలు బాగా చెప్తారట నాన్నా ! అందులోనే మనవాడిని చేర్పిద్దామని పోతే చెంపలు వాయించినంత పంజేసిందా మేడమ్ !" చటుక్కున లేచిండు. బూట్లు టకటకలాడినై. చకచకా వెళ్లిపోయిండు.

అటువైపే చూస్తూ బుర్రగోక్కున్నడు వెంకట్రామయ్య.

రోజులు మారిపోయినై. ఇంట్లో తల్లిదండ్రుల శ్రద్ధను పరీక్షించే పసిపిల్లలకు పాఠశాల సీటిస్తున్నారు. ఇహ పెద్ద చదువులో ! ... చదువుకునే కాలం పోయి చదువు కొనే కాలమొచ్చింది. ప్చ్ ... నా మనుమని సీటుకోసం నేను ప్రయత్నిస్తా.

కోడలితో చెప్పేసి తయారైండు. పసి ప్రహ్లాద్‌ను వెంటబెట్టుకుని బయలు దేరిండు. కాని ... లోపల గోకుతూనే ఉంది. మనసు వెనక్కు లాగుతూంటే మనిషి ముందు కెల్తున్నాడు. సమయం తొమ్మిదన్నరైంది.

గేటు ముందు సైన్‌బోర్డు చూడముచ్చటగా ఉంది. ప్రతిభ, పాఠవాల

పదాల మధ్య ఒడ్డాణం ధరించిన సర్వశుక్ల సరస్వతి రంగుల బొమ్మ... అపురూపం.. చేతులెత్తి మొక్కాలన్పించింది.

ఆవరణలో ప్రవేశించగానే సామూహిక సరస్వతీ ప్రార్థన స్వాగతించింది. వేయి వసంత కోయిలలు ఒకేసారి గొంతెత్తి పాడుతున్నట్టుంది. ఆవరణ చుట్టూ ఎదిగిన చెట్లు కులాసాగా తలలాడిస్తున్నై. చల్లని పిల్ల గాలి ఒంటిని అభిషేకించింది. హాయిగా ఉంది.

ప్రార్థనవగానే పిల్లలు, ఉపాధ్యాయులు క్లాసుల్లోకెళ్లి పోతున్నారు.

రానైతే వచ్చాను గాని ... ఏమవుతుందో ఏమో ! ... గుంజాటన యధాతథం.

"నమస్కారమండీ !" హెడ్మాస్టర్ గదిలో అడుగు పడింది. వెన్నులో సన్నని వణుకు. చేతివేలు మనవని చేతిలోనే ఉంది.

"నమస్కారం ... రండి." సన్నని గొంతు. హెడ్మాస్టర్ సీట్లో మహిళ ... కూచోబోయి ఆగిపోయింది. తెల్లని డ్రెస్సు, నల్లని కాటుక కళ్ళు, కనుబొమలమధ్య ఎర్రని కుంకుమబొట్టు, మూడు రాళ్ల ముక్కపుడక, చెవులకు మకర కుందనాలు, నడుముకు మూడంగుళాల వెడల్పుతో రంగుల రాళ్లు పొదిగిన ఒడ్డాణం ... అచ్చం... వాగ్దేవిలాగుంది.

"మీరు ప్రధానాచార్య గారు కదూ !" అనేసిండు.

"అవును ... "

పాలనురగను తలదన్నే తెల్లని ధోవతి, లేతగోధుమ రంగు లాల్చీ, నుదుట తిలకం బొట్టుతో లోపలికొస్తున్న వెంకట్రామయ్య నాపాదమస్తకం తడుముతున్నాయామె చూపులు.

"దయచేసి కూచోండి ..." కళ్లతో కుర్చీ చూపించింది.

"ముందు ... మీరు కూచోండి."

"అయ్యో ... మీరు పెద్దవారు, దయచేసి కూచోండి."

"వయసులో నేను పెద్దవాడినైనా ... ఇప్పుడు వరుసలో మీరు పెద్దగదా !"

మొహం చూసుకుని ... ఒకేసారి కూచున్నారిద్దరూ. ఆమె చూపులు ప్రహ్లాద్ వైపు మళ్లినై.

"ఈ బాబు... ఇంతకు ముందు ఆ సూటు బూటేసుకుని, టక్ జేసుకొచ్చిన

తెలుగు పండితుని వెంటొచ్చాడు గదా ! సీటు కావాలని నా ప్రాణాలు తోడేసిండా మహానుభావుడు."

"ఆ తెలుగు పండితుడు నా కొడుకు. వీడు వాని కొడుకు. నా మనవడు... ప్రహ్లాద్ ! ... నమస్కారం చెయ్." ప్రహ్లాద్ చేతులతో నమస్కారం చేయించిండు.

ప్రధానాచార్య కనురెప్పలు టపటపలాడినై. తృప్తిగా నవ్వుకుంది.

"ఒడ్డాణం కనబడితే నాకు ఒళ్ళు పులకరిస్తుందమ్మా. మన సాంప్రదాయని కది చక్కని నిదర్శనం. మహిళామణికి నిండుదనాన్నిస్తుంది ... "

"అదీ... అది ... మన సంస్కృతి పట్ల మీ అవగాహనకు జోహార్లు ..." మురిసి పోయింది. "ఇంతకు మీరేంజేస్తారు ?"

లెక్చరర్ ప్రాణం లేచొచ్చింది.

"చాలా సంతోషమమ్మా. ఇంగ్లీషు లెక్చరర్‌గా పంజేసి రిటైరయాను... "

"ఆహా ! మీరు ధన్యజీవులు ... " చేతులు జోడించింది.

"నాలో ఇంకా శక్తి చావలేదమ్మా" అంతరాళాల్లో ఆనందోత్సాహాలు గంతులేసినై. "ఏదో ఒక ఉద్యోగంలో చేరాలనుకుంటున్నానమ్మా ... !"

"మీరిన్ని సంవత్సరాలు శ్రమించి పంజేశారని ప్రభుత్వం విశ్రాంతి తీసుకొమ్మంది. భాష ఏదైనా భావన ముఖ్యం. మీరు ఇంగ్లీషులో నిష్ణాతులైనా... అసలు సిసలైన భారతీయులు. మీ మనవని చదువు గురించి ఇంటివద్ద తప్పక శ్రద్ధ తీసుకుంటారు... "

"కానీ ... వీణ్ని ఈ పాఠశాలలనే చేర్చాలనీ ..."

గొంతులో తడారి పోతున్నట్టుంది. గుండె గుబగుబలాడ్తోంది. దృష్టి ... ఒడ్డాణం రంగుల హంగుల మీదుంది.

"బాబునే కాదు, ఈ బాబు బాబుకు బాబైన మిమ్ముల్ని గూడా ఈ పాఠశాలలో చేర్చుకుంటా మండీ !" ఎర్రని పెదాలమీద తెల్లని చిరునవ్వు తళుక్కుమంది.

అంటే ... నాకేమీ తెలీదనా ! మళ్ళీ పలకాబలపం పట్టుకుని బడిలో చేరాలనా! ఈవిడ అభిప్రాయమేమిటో. రోషం తాలూకు కుతకుతలాట.

"న్న .... నన్ను గూడానా ? మీరేమంటున్నారు ?"

"అవును.  మీరిన్నాళ్లు అవిశ్రాంతముగా పంజేసి అలసిపోలేదు.  మా పాఠశాలలో ఆంగ్లోపాధ్యాయులుగా చేరి పిల్లలకూ, మాకు పెద్దదిక్కుగా ఉండాలని సవినయంగా అడుగుతున్నానంతే ... !"  లేచి నుంచుంది.

"ఓహ్ అదా !" ... వెంకట్రామయ్య మొహం వికసించింది.

"అయితే ఒక్క దెబ్బకు రెండు పిట్టలన్నమాటా ! " కళ్లు మిలమిల లాడినై. ఆ కళ్లకు ప్రధానాచార్య భారతమాతగా, ఆమె మూడు రాళ్ల ముక్కపుడక త్రివర్ణ పతాకంలా కనిపించినై.  మనసులో మలయమారుతం వీచింది.

"అసలూ ... ఆ ఒడ్డాణమే ఇంత పని చేయించిదమ్మా !"

"నా ఒడ్డాణమా ?" ఒడ్డాణం వైపు చూసుకుంది - ఆశ్చర్యంగా.

"అవునమ్మా.  ఇన్నాళ్లు పీ.జి. సెంటర్లో యువతకు పాఠాలు చెప్పి ఏమీ సాధించలేక పోయాను.  ఇప్పుడు బ్రహ్మస్వరూపులైన బాలలకు ఆంగ్ల భాషతోపాటు భారతీయత నేర్పిస్తా.  నాకదే తృప్తి.  నశించిపోతుందనుకున్న మన సంస్కృతిని బతికించుమని ఆ ఒడ్డాణం చెబుతుందమ్మా ..."

నరాల్లో ప్రవహిస్తున్న ఆనందం కళ్లల్లో మెరిసింది.

"చాలా సంతోషమండీ ... !"  అడ్మిషన్ ఫారం అందించింది.

"ధన్యవాదాలమ్మా !" ప్రహ్లాద్ లేత బుగ్గల్ని మృదువుగా నిమిరాడు. "నా మనవడు అదృష్టవంతుడమ్మా !" అంటూ ఫారం నింపేందుకుద్యుక్తుడయిండు. జేబునుండి కలం తీస్తుంటే మరోసారి ఒడ్డాణాన్ని చూడాలన్పిస్తోంది.